భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో శ్రమదానం

భిక్కనూరు, మార్చి 18: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-6 ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చెత్తాచెదారాన్ని తొలగించారు. ఇటీవల వర్షానికి కొన్ని చెట్లు నేలకూలగా వాటిని తొలగించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి సరిత మాట్లాడుతూ ఎల్లప్పుడు క్యాంపస్ పరిసరాలను శుభ్రంగా ఉండేలా వాలంటీర్లు కృషి చేయాలన్నారు. ఇందులో అధ్యాపకులు మోహన్‌బాబు, వైశాలీ, శ్రీమాత, తదితరులు పాల్గొన్నారు.



● బీర్కూర్ శివారులో ఇసుకను తవ్వుతున్న దృశ్యం



జిల్లాలో ఇసుక.. కొరత!

- చెంతనే మంజీర నదిలో ఇసుక మేటలు ఉన్నా.. అవసరాలకు లభించని ఇసుక
- అభివృద్ధి పనులకు సైతం దొరకని పరిస్థితి
- స్థానికంగా కుదేలవుతున్న నిర్మాణ రంగం
- టన్ను ఇసుక కనీసధర రూ.3 వేలు
- బ్లాక్‌లో కొనాల్సిన పరిస్థితి నెలకొందంటున్న బిల్డర్‌లు, కాంట్రాక్టర్లు
- ప్రస్తుతం ఇసుకకు ఫుల్ డిమాండ్
- మంజీర, కూడెల్లి, పెద్దవాగుల నుంచి అక్రమంగా తరలిస్తున్న వైనం
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చెక్‌డ్యాంల పేరిట ఇసుక అక్రమ తరలింపు అనే విమర్శలు
- జిల్లాలో ఇసుక రిచ్‌లను రద్దు చేసి తవ్వకాలను నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వం

కామారెడ్డి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా ఉండే మంజీర నది నుంచి ఇసుక మేటలు చాలానే ఉన్నప్పటికీ.. జిల్లా అవసరాలకు మాత్రం ఇసుక దొరకడం లేదు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులకు గానీ, నిర్మాణ రంగాలకు గానీ ఇసుక లభించకపోవడంతో స్థానికంగా నిర్మాణ రంగం కుదేలవుతుంది. జిల్లాలో ఇప్పుడు ఇసుకకు ఫుల్ డిమాండ్ నెలకొంటుంది. ట్రాక్టర్ ఇసుక తెప్పించుకోవడం కోసం వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక రిచ్‌లను రద్దు చేసి తవ్వకాలను నిలిపివేసింది. కేవలం కాళేశ్వరం వద్ద మాత్రమే పరిమితిలోపే తవ్వకాలకు అనుమతి ఇస్తుంది. దీంతో ఇసుక తవ్వకాలు జరగక ఇసుకకు మార్కెట్‌లో కొరత ఏర్పడుతోంది. గతంలో మంజీర నదిలో టీఎస్ ఎండీసీ ద్వారానే తవ్వకాలు జరపడంతో ఇసుక అమ్మకాలు జరుగుతుండేవి. కానీ ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరగడం లేదు. పొరుగు జిల్లాల నుంచి సైతం ఇసుక సరాఫరా కాకపోవడంతో బ్లాక్‌లో ఇసుకను కొనాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని బిల్డర్‌లు, కాంట్రాక్టర్‌లు చెబుతున్నారు.

ఇసుక టెండర్ల రద్దు

జిల్లాలో నిజాంసాగర్, బిచ్కుంద, పిట్లం, మద్నూర్, బాన్సువాడ, బీర్కూర్ మీదుగా మంజీర నది ప్రవహిస్తూ ఉంటుంది. ఈ మంజీర నది గుండా భారీగానే ఇసుక మేటలు ఉంటాయి. మంజీర నది ఇసుకకు హైదరాబాద్, మహారాష్ట్రలాంటి మహానగరాలతో పాటు జిల్లాలోనూ మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో గతంలో మంజీర నది నుంచి ఇసుకాసురులు అక్రమంగా వందలాది టిప్పర్‌లలో తరలిస్తున్నట్లు విమర్శలు వెలువెత్తాయి. గత ప్రభుత్వంలోనూ చెక్‌డ్యాంల పేరిట ఇసుక టెండర్లను వేసి పెద్దమొత్తంలో అక్రమంగా తరలించారని విమర్శలు వచ్చాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు ఇసుకను అక్రమంగా పక్కదారి పట్టిస్తుండడంతో చాలానే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం టీఎస్ ఎండీసీ ద్వారా చేపడుతున్న ఇసుక తవ్వకాలను, టెండర్లను రద్దు చేసింది. గత మూడునెలలుగా ఇసుక తవ్వకాలు జరగకపోవడంతో ఇసుక కొరత నెలకొంటూ వస్తుంది. అయితే జిల్లాలో జరిగే ప్రభుత్వ అభివృద్ధి పనులకు స్థానికంగా తహసీల్దార్‌లు తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారు. కానీ మంజీర ఇసుక మాత్రం జిల్లా అవసరాలకు ఉపయోగపడడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమంగా తవ్వకాలు


జిల్లాలో ప్రభుత్వపరంగా ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. గత మూడు నెలలుగా ఇసుక తవ్వకాలు జరగకపోవడంతో ఇసుకకు మార్కెట్‌లో మంచి డిమాండ్ నెలకొంది. ఇదే అదనుగా భావిస్తున్న స్థానికంగా ఉండే కొందరు అక్రమార్కులు అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ జోరుగా విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా జిల్లాలోని బిచ్కుంద, బీర్కూర్, మద్నూర్, బాన్సువాడ ప్రాంతాలతో పాటు బీబీపేట, దోమకొండ, లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట ప్రాంతాల్లోనూ మంజీర నదితో పాటు కూడెల్లివాగు, పెద్దవాగులలో పలువురు ట్రాక్టర్‌ల ద్వారా అక్రమంగా ఇసుకను తవ్వకాలు జరుపుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అంతేకాకుండా తాజాగా బిచ్కుంద మండలంలో మంజీర నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పది ట్రాక్టర్‌లను పోలీసులు పట్టుకున్నారు. మంజీరలో ఇసుక తవ్వకాలు నిలిపివేసినప్పటికీ.. కొందరు అక్రమార్కులు జోరుగా ఇసుక తవ్వకాలు జరుపుతూ అక్రమంగా తరలిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు.

స్థానికంగా లభించని ఇసుక

నిర్మాణ రంగంలో ఉన్న బిల్డర్‌లు, సివిల్ ఇంజనీర్‌లు పనులు చేసే కాంట్రాక్టర్‌లు ఇసుకను స్థానికంగానే కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతారు. టీఎస్ ఎండీసీ నుంచి ఇసుక తీసుకోవాలంటే ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ రాయల్టీ పోను రవాణా చార్జీలు, ఇతర ఖర్చులు కలిపి ఒక క్యూబిక్ మీటర్ ఇసుకకు రూ.1500 వరకు వసూలు చేస్తారు. ఒక క్యూబిక్ మీటర్ ఇసుక కొంటే టన్నునర ప్రస్తుతం మార్కెట్‌లో ఇసుక రూ.1500 వరకు పలుకుతోంది. ఒక ట్రాక్టర్‌లో నాలుగున్నర టన్నుల ఇసుక అధికారికంగా రవాణా చేస్తే రూ.4500 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇది తక్కువ క్వాలిటి ఇసుక ధర అదే అస్త్రకార్, దుబారాకు ఉపయోగించే సన్నఇసుక అయితే రూ.6 వేల వరకు సమర్పించుకోవాల్సిందే. ఇది స్థానికంగా సాండ్ ట్యాక్స్‌ల ద్వారా, తహసీల్దార్‌ల ద్వారా గుర్తించిన క్వారీల నుంచి ఇసుకను తరలిస్తే ప్రభుత్వానికి టన్నుకు రూ.40 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో బిల్డర్‌లు, కాంట్రాక్టర్‌లు స్థానిక ఇసుకకే ప్రాధాన్యత ఇస్తారు.

టన్ను ఇసుక రూ.3 వేలకు పైగానే

జిల్లాలో మంజీర, కుడెలి, గోలిలింగాల, పాల్వంచ, లింగంపేట, పెద్ద వాగుల నుంచే ఇసుక రవాణా జరిగేది. అధికారికంగా ఇసుక రిచ్‌లు కూడా ఉండేవీ. అయితే ప్రభుత్వం ఇసుక టెండర్లను, తవ్వకాలను నిలిపివేసింది. దీంతో జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఎదురవుతోంది. జిల్లాలో ఇసుక తవ్వకాలు జరగడం లేదు. ప్రభుత్వం కేవలం కాళేశ్వరం నుంచి మాత్రమే ఇసుకను తవ్వకాలకు అనుమతులు ఉన్నాయి. అవసరాలకు అక్కడి నుంచి జిల్లావాసులు తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. దీంతో ఇసుకకు డిమాండ్ ఎదురవుతుండ డంతో ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల నుంచి రూ.5 వేలవరకు విక్రయిస్తున్నారు. గతంలో రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు దొరికే ఇసుక అమాంతంగా.. రెండింతలు దాటడంతో తక్షణ అవసరాలు ఉన్నవారు మినహా ఎవరూ ఇసుక వైపు చూడడం లేదు. నిర్మాణ రంగంలో ఉన్నవారు పనులను నిలిపి వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో నిర్మాణ రంగం కుదేలు అవుతోంది.



సంక్షిప్త సమాచారం



వైద్యఆరోగ్య శాఖ మంత్రితో చర్చిస్తున్న షబ్బీర్‌అలీ

దోమకొండ సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలి

కామారెడ్డి టౌన్, మార్చి 18: మండల కేంద్రంలోని 30 పడకల సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సోమవారం తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గత ప్రభుత్వాన్ని పలు దఫాలుగా వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని విన్నవించినా.. ఎలాంటి చర్యలు లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పడకల పెంపుపై మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఎన్నికల కోడ్ ముగియగానే వంద పడకల ఆసుపత్రి వచ్చే విధంగా కృషి చేసే అవకాశం ఉందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



వేలం పాటను నిర్వహిస్తున్న దృశ్యం

బిచ్కుందలో తైబజార్ వేలం

బిచ్కుంద, మార్చి 18: బిచ్కుంద మేజర్ గ్రామ పంచాయతీ తైబజార్ వేలం పాట నిర్వహించగా చివరి వేలం పాట రూ.15లక్షల 50 వేలకు కాజామియా తైబజార్ దక్కించుకోవడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం బిచ్కుంద గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో 2024-25గాను తైబజార్ వేలం నిర్వహించారు. రూ.2లక్షల డిపాజిట్ చెల్లించిన వారు పోటాపోటీగా వేలం లో పాల్గొనగా చివరిగా.. బిచ్కుందకు చెందిన కాజామియాకు రూ.15లక్షల 50 వేల దక్కించుకున్నట్లు కార్యదర్శి తెలిపారు. ఇందులో మహబూబ్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

గాంధారి, మార్చి 18: బీజేపీ మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మదుసూదన్‌రావు, ప్రధానకార్యదర్శులుగా శ్రీకాంత్‌గౌడ్, రాంసింగ్, మండల ఉపాధ్యాక్షులుగా రాజిరెడ్డి, గోపాల్, రాజు, రమేష్, మండల ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా నవీన్, గాంధారి టౌన్ అధ్యక్షుడిగా గంగిరమేష్, ప్రధాన కార్యదర్శులుగా రాజశేఖర్, బాలకృష్ణ, ఉపాధ్యాక్షుడిగా రవి, వాసు, రఘుపతి, రాహుల్, పట్టణ కార్యదర్శిగా కిషన్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకైనా వారిలో ఉన్నారు.

జిల్లాలో ప్రారంభమైన పది పరీక్షలు

● తొలిరోజు పరీక్షకు 11,962 మంది విద్యార్థులకు గాను 11,940 మంది హాజరు ● ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు లేవు : డీఈవో



జిల్లాకేంద్రంలోని బాలుర పాఠశాలలో హాల్ టికెట్ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రంలో నిర్వహణ తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



పెద్దకొడప్‌గల్‌లో హాల్ టికెట్ నెంబరు చూసుకుంటున్న విద్యార్థులు



మద్నూర్‌లో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

కామారెడ్డి టౌన్, మార్చి 18: జిల్లావ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు 62 సెంటర్లలో ప్రశాంతంగా కొనసాగాయి. మొదటిరోజు తెలుగు సబ్జెక్ట్ కొనసాగగా మొత్తం 11,962 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 11,940 మంది విద్యార్థులు హజరైనట్లు డీఈవో రాజు తెలిపారు. ప్రైవేట్‌గా పరీక్ష రాయడానికి 24 మంది విద్యార్థులకు గాను ఐదుగురు హజరవగా 19 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఉదయం 9.30 పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా.. గంట ముందునుంచే పరీక్ష హాల్‌లోకి విద్యార్థులను అనుమతించారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, వాగ్దేవి పాఠశాలలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరు, విద్యార్థుల హాజరు వివరాలను అధికారులనుఅడిగి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించారు. కేంద్రాలలో ఏర్పాటుచేసిన మౌలిక వసతులను పరిశీలించి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

సదాశివనగర్: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఎంఈవో యూసఫ్ తెలిపారు. మొత్తం 614 మంది విద్యార్థులకు గాను 611 మంది హాజరయ్యారు. మొత్తం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయగా జడ్పీహెచ్‌ఎస్ కల్వరాల్‌లో 90మంది విద్యార్థులకు 87మంది హాజరయ్యారు. మిగిలిన మూడు కేంద్రాలలో వంద శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

తాడ్వాయి: మండలంలో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో రామస్వామి తెలిపారు. తాడ్వాయి ఉన్నత పాఠశాలలో 180 మంది, కన్కల్ ఉన్నత పాఠశాలలో 136, తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలలో 134 మంది పరీక్షలకు హజరైనట్లు తెలిపారు.

బాన్సువాడ టౌన్: పదవతరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు గాను విద్యాశాఖాధికారులు బాన్సువాడలో 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి పరీక్ష రోజున మొత్తం 1095 మంది విద్యార్థులకు గాను 1092 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు.

పెద్దకొడప్‌గల్: మండలకేంద్రంలో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో పది పరీక్ష కేంద్రంను అధికారులు ఏర్పాటు చేయగా, ఈ పరీక్ష కేంద్రంలో పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాలతో పాటు కాటేపల్లి, వడ్లం, శాంతాపూర్, పత్లాపూర్ ,పెద్ద కొడప్‌గల్ బాలికల గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రంలో మొత్తం 209 విద్యార్థులకు 206 మంది విద్యార్థులు హాజరు అయ్యారని, 3 విద్యార్థులు గైర్హా.జరు అయినట్లు సీఎస్ రమణ రావ్ తెలిపారు.

బీర్కూర్: మండలకేంద్రంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 261 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. తొలి రోజు తెలుగు పేపర్ 261 మందికి గాను 260 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు.

మద్నూర్: ఉమ్మడి మండలాల్లో 8 హైస్కూళ్లు, 3 గురుకుల పాఠశాలల విద్యార్థుల కోసం పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. సోమవారం తొలిరోజు 508 మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. పెద్ద ఎక్లారా ఉన్నత పాఠశాల, గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు బిచ్కుంద పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

'జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఏకగ్రీవ తీర్మానం'

పెద్దకొడప్‌గల్, మార్చి 18: పెద్దకొడప్‌గల్ సహకార సంఘం పరిధిలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సహకార సంఘం సమావేశంలో రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం మహాజన సభ అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరగగా సభలో పలు అంశాలపై సభ్యులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇక మండలంలో రైతన్నలు ఈ సారి అధికంగా జొన్న పంటను సాగు చేసినందున ఈ విషయాన్ని అధికారులు గుర్తెరిగి మండలంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వం మండలంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి జొన్నలను కొనుగోలు చేసిన విషయం గుర్తుచేశారు. అంతేగాక గత ప్రభుత్వం రంగుమారిన జొన్నలను కొనుగోలు చేసిన విషయం గుర్తు చేశారు. ఇక అంతకు ముందు సంఘం సీఈవో సందీప్ సంఘ ఆదాయ వ్యయ నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా నిబద్ధతతో పని చేయాలి

● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంని ప్రారంభించిన కలెక్టర్

కామారెడ్డి టౌన్, మార్చి 18: లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా నిర్వహించేందుకు నోడల్ అధికారులు, వివిధ బృందాలు ప్రవర్తన నియామావళిపై పూర్తిఅవగాహన కలిగి ఉండి నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంట్రోల్ రూమ్‌కు సువిధ, 1950 వచ్చే ఫిర్యాదు పట్ల అప్రమత్తంగా ఉంటూ వంద నిముషాలలో పరిష్కరించే విధంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను అప్రమత్తంగా చేయాలన్నారు. వివిధ సామాజిక మాధ్యమాలు, టీవీ, దినపత్రికలలో వచ్చే ప్రకటనలు, చెల్లింపు వార్తలు, టీవీ న్యూస్, యూ ట్యూబ్, వేటూ ఎస్ఎంఎస్, తదితర వాటిపట్ల ప్రత్యేక దృష్టిపెట్టి చూడడంతో పాటు గుర్తించాలని అన్నారు. రాజకీయ పార్టీలు,అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతి అదేరోజు అందించే విధంగా ఎంసీఎంసీ పనిచేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలకు, నాయకుల సమావేశాలు నిర్వహించుకునేందుకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా సామాజిక మాధ్యమాలలో ఎన్నికల యంత్రాంగంపై అపోహలు సృష్టించేలా వచ్చే ఫేక్ న్యూస్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి ఖండించాలని తెలిపారు. సువిధ యాప్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు జరగకుండా నిబంధనల ప్రకారం సకాలంలో రాజకీయ పార్టీలకు అభ్యర్థులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. సీజ్ చేసిన డబ్బులు, ఇతర ఆభరణాలు ఏడురోజుల కంటే ఎక్కువ గ్రీవెన్స్ కమిటీ వద్ద ఉండవద్దని, సంబంధిత వ్యక్తులు నగదుకు సంబంధించిన ఆధారాలు సమర్పించకపోతే వెంటనే ఎఫ్ఐఆర్ బుక్ చేయాలని తెలిపారు. ఎన్నికల సందర్భంగా నిర్వహించే తనిఖీలలో నగదు జప్తుచేసే సమయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సమావేశంలో నోడల్ అధికారులు బావయ్య, మురళీకృష్ణ, అంబాజీ, వెంకటేశ్వర్లు, ఏవో మసూరిఅహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

'సరైన ధ్రువపత్రాలు ఉంటేనే రిజిస్ట్రేషన్లు'

కామారెడ్డి టౌన్, మార్చి 18: డాక్యుమెంట్ రైటర్‌లు, రియల్టర్లు భూ క్రయవిక్రయాలలో ఎక్కడ కూడా అక్రమాలకు తావులేకుండా సహకరించాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లతో కలిసి క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ భూములు అమ్మినా, కొన్న డాక్యుమెంట్ రైటర్‌లు సరైన ధ్రువపత్రాలు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని తెలిపారు. అసలైన పట్టాదారులకు ఇబ్బందులు కలిగించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచిస్తామని తెలిపారు.



డాక్యుమెంట్ రైటర్లు,రియల్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆర్థిక ఇబ్బందులతో వృద్ధ దంపతుల బలవన్మరణం

● నిజాంసాగర్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య ● నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఘటన



చెరువులో పడి ఉన్న దంపతుల మృతదేహాలు

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 : ఆర్థిక ఇబ్బందులతో వృద్ధ దంపతులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజామాబాద్‌లో సోమవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో ఉన్న నిజాంసాగర్ కెనాల్‌లో దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. బోధన్ మండలం అమ్దాపూర్‌కు చెందిన బాబయ్య (65), పోచమ్మ (60) భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో నాలుగు నెలల క్రితం నిజామాబాద్‌కు వచ్చి భిక్షాటన చేస్తూ పొట్ట పోసుకుంటున్నారు. అయితే రోజురోజుకూ ఆర్థిక ఇబ్బందులు తీవ్రం కావడంతో.. నిత్యం పొట్ట గడవడమే కష్టంగా మారింది. దీంతో మనస్థాపానికి గురైన బాబయ్య, పోచమ్మ దంపతులు సోమవారం నగరంలోని నిజాంసాగర్ కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారి కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగర ఆరో టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

యంచలో చెక్‌పోస్ట్ ఏర్పాటు

నవీపేట,మార్చి18 : నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని యంచలో ఆదివారం చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం, నగదు సరఫరా కాకుండా ప్రత్యేక పోలీసు సిబ్బందితో ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా సోమవారం యంచ చెక్‌పోస్టును ఎస్సై యాదగిరి గౌడ్ పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైపు తండ్రి చావు.. మరోవైపు పరీక్షలు..

● పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థిని



విద్యార్థిని స్రవంతి

నసురుల్లాబాద్, మార్చి 18 : తండ్రి మరణించిన బాధను దిగమింగుకొని ఓ విద్యార్థిని పదో తరగతి పరీక్షకు హాజరైన ఘటన కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్‌లో సోమవారం చోటు చేసుకుంది. నసురుల్లాబాద్‌కు చెందిన దండు శ్రీను (50) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. పదో తరగతి చదువుతున్న అతని రెండో కూతురు స్రవంతి సోమవారం పదవ తరగతి పరీక్షకు హాజరైంది. కుటుంబీకులు ధైర్యం చెప్పడంతో.. తండ్రి మృతిని దిగమింగుకొని, పరీక్ష రాసింది.



నవీపేట రైల్వే గేటుకు ఇరువైపులా నిలిచిన వాహనాలు

రైల్వే గేటుకు తాళం పడకపోవడంతో నిలిచిన రైలు

● నవీపేటలో గంట పాటు నిలిచిన వాహనాలు

నవీపేట,మార్చి18: నవీపేటలోని ప్రధాన రహదారిపై ఉన్న రైల్వేగేటుకు సోమవారం సాయంత్రం తాళం సరిగా పడకపోవడంతో సిగ్నల్ బయటనే రైలు నిలిచిపోయింది. నాగర్‌సోల్ నుండి కాచిగూడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండడంతో గేట్‌మెన్ గేటును మూసి వేయగా.. దానికి తాళం పడలేదు. దీంతో స్టేషన్ నుండి సిగ్నల్ క్లియర్ కాకపోవడంతో సిగ్నల్ బయటనే రైలు నిలిచిపోయింది. దీంతో గేట్‌మెన్ తాళాన్ని సరి చేయడానికి ప్రయత్నిస్తూ ఎమర్జెన్సీ గేటును వేశారు. దీంతో రైలు ముందు కు వెళ్లగా సుమారు గంట పాటు గేటుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రైతులకు భారంగా వరికోతలు

పంట నేలకొరగడంతో కోతలకు ఇక్కట్లు

కోతలకు పెరిగిన యంత్రాల చార్జీలు

రైతుకు భారంగా మారిన ఖర్చులు

ఎడపల్లి, మార్చి 18: మండలంలో యాసంగి సీజన్‌లో వేసిన వరిపంట కోతలు మొదలయ్యాయి. శనివారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు మండలంలో దాదాపు 930ఎకరాల వరిపంట నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. నేలకొరిగిన వరిపంటను యంత్రం సాయంతో కోయడానికి దాదాపు 4గంటల సమయం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిపంట నిటారుగా ఉండి యంత్రం సాయంతో కోస్తే గంట సమయం పట్టేది. గంటకు యంత్రానికి 2500 రూపాయలు చెల్లించేదని కానీ అకాల వర్షంతో 10వేల వరకు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఎకారానికి 7 వేలు అధికంగా చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేవలం ఒక్క ఎడపల్లి మండలంలోనే ఈదురుగాలులు, 33 మి.మీల అకాల వర్షం కురవడంతో రైతులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. మండలంలో సుమారు 30 శాతానికి పైగా సాగు చేసిన వరిపంటలు కోతకు వచ్చిన సమయంలో ఈ ప్రకృతి ఒక్కసారిగా కన్నెర్ర చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని దిగులు చెందుతున్నారు. గతంలో మాదిరిగా అకాల వర్షం ఈదురుగాలులకు నష్టపోయిన రైతుల పేర్లు నమోదు చేసుకుని ఎలాంటి పరిహారం అందించక పోవడం శోచనీయమని, ఇప్పటికైనా పట్టించుకోవాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కాగా, మండలంలోని ఇబ్రహీంపూర్ శివారులోగల 40 ఎకరాలు కౌలు తీసుకుని సంట సాగుచేయగా కోతకు వచ్చిన పది ఎకరాలను సోమవారం కోయడంతో ఒక ఎకరానికి వరినూర్పిడి యంత్రం నేలకొరిగిన వరిపంటను నాలుగు గంటలకుపైగా సమయంలో కోయడంతో సుమారు 7 వేలకుపైగా అదనపు భారం పడిందని ఆయన వాపోయాడు.



వరి పంట కోస్తున్న రైతు దృశ్యం



ప్రధాని మోదీని కలిసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

మోదీని కలిసిన బోధన్ బీజేపీ నాయకులు

బోధన్ రూరల్, మార్చి 18: జగిత్యాలలో విజయ సంకల్ప సభ కార్యక్రమానికి విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, బోధన్ నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా బోధన్ రాజకీయంపై చర్చించినట్లు మేడపాటి ప్రకాష్‌రెడ్డి తెలిపారు.

జైతాపూర్‌ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారి



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్ అధికారి

ఎడపల్లి, మార్చి 18: మండలంలోని జైతాపూర్ గ్రామాన్ని సోమవారం ట్రైనీ ఐఏఎస్ అధికారిని కిరణ్మయి సందర్శించారు. గ్రామంలోని వివిధ శాఖల అధికారులతో ఆమె మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 5 రోజులపాటు గ్రామంలో సందర్శించి అన్నిరకాల అంశాలపై పర్యవేక్షణ జరిపి తయారు చేసిన నివేదికను పైఅధికారులకు అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి గోపాలకృష్ణ, ఆర్ఐ వినోద్, పంచాయితీ కార్యదర్శులు నాగేష్, ఉదయ భాస్కర్ తదితరులు ఉన్నారు.

మోదీ సభకు తరలివెళ్లిన బీజేపీ నాయకులు



సిరికొండ నుంచి జగిత్యాలకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు



ముప్కాల్ నుంచి జగిత్యాలకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

ముప్కాల్, మార్చి 18: జగిత్యాల్ జిల్లాలో నిర్వహిస్తున్న తెలంగాణ బీజేపీ విజయ సంకల్ప యాత్ర సభకు సోమవారం బాల్కొండ, ముప్కాల్ మండలాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ప్రధాని నరేంద్రమోదీ విచ్చేసి ప్రసంగించనున్నారు. తరలివెళ్లిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు అంబాటి నవీన్, సంతోష్‌రెడ్డి, ఎంపీటీసీసభ్యురాలు నాయకుడు పద్మ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, కెఎం రెడ్డి ఉన్నారు.

నవీపేట: జగిత్యాలలో సోమవారం జరిగిన భారీ బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న ఈ బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాలలో జగిత్యాలకు తరలివెళ్లారు.

సిరికొండ: సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సమావేశానికి సిరికొండ మండలం నుంచి బీజేపీ నాయకులు బస్సులో తరలివెళ్లారు. మండలం నుంచి బీజేపీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రుమాండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బస్సుల్లో కార్యకర్తలు తరలివెళ్లారు. వారి వెంట జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, బీసీ మోర్చ జిల్లా కార్యదర్శి రామస్వామి, మండల బీసీ అధ్యక్షుడు సతీష్, యువమోర్చా మండల అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సంద్ర శంకర్, సంజీవ్‌రెడ్డి, మురళి, లింబాద్రి, సాయికుమార్ ఉన్నారు.

పెద్దబజార్: జగిత్యాల్ జిల్లాలోని గీత విద్యాలయం గ్రౌండ్‌లో జరుగుతున్న బీజేపీ విజయసంకల్ప బహిరంగ సభకు సోమవారం జిల్లా కేంద్రం నుంచి భారీగా నాయకులు, ప్రజలు తరలివెళ్లారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ వెంట బీజేపీ జిల్లా నాయకులు, కార్పొరేటర్లు ఆకుల హేమలత శ్రీనివాస్, మమత ప్రభాకర్, సుక్కమధు, మాస్టర్ శంకర్, కార్యర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల వేసవి ప్రత్యేక శిబిరం

ఆర్మూర్‌రూరల్, మార్చి 18: మండలంలోని గోవింద్‌పేట్, ఫత్తేపూర్, పిప్రి గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 వాలంటీర్లు గోవింద్‌పేట్‌లో, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2, ఫత్తేపూర్‌లో, యూనిట్-3 విద్యార్థులు పిప్రి గ్రామాల్లో వేసవికాల ప్రత్యేక శిబిరంలో పాల్గొని సేవలందించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాలస్వామి మాట్లాడుతూ.. జాతీయ సేవ పథకం కార్యక్రమం ఉత్తమమైందని, ఇందులో పాల్గొనడం వల్ల విద్యార్థులు సమాజంలో బాధ్యత కలిగిన పౌరులుగా తయారు కావడానికి అవకాశం లభిస్తుందన్నారు. వారం రోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గ్రామాలలో శ్రమదానం, చైతన్య సదస్సులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు వెంకటేశ్వర్‌లు, అనితపవార్, వీడీసీసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాలస్వామి

వన్నెల్(బి)లో వెంకటేశ్వరస్వామి పల్లకీసేవ

ముప్కాల్, మార్చి 18: బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. సోమవారం ఉతయం ఉత్సవమూర్తులు అభిషేకం, నూతన వస్త్రాలంకరణ అనంతరం శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. మహిళలు మంగళహరతులతో స్వాగతం పలికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులను తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో హోమం, దేవత హవనం, కలశపూజ వంటి పూజలు నిర్వహించారు. మంగళవారం జరిగే స్వామివారి కళ్యాణ మహోత్సవానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

దేవత మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనలు

ఆర్మూర్‌రూరల్, మార్చి 18: ఆర్మూర్‌మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో శివపంచాయతన సహిత హన్మాన్ దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విగ్రహాల ఊరేగింపు అనంతరం ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. బుధవారం శ్రీ హంపి విరుపక్ష విద్యరణ్య స్వామిజి చేతుల మీదుగా శివపంచయత నవగ్రహ, ధ్వజశిఖర సహీత హన్మాన్ దేవత మూర్తులు, యంత్ర స్థాపన, మూర్తుల ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు గ్రామాభివృద్ధి కమిటీ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఇట్టెడి గంగారెడ్డి, కోశాధికారి తిరుపతిగౌడ్, ప్రధానకార్యదర్శి గడ్డి కార్తిక్, సభ్యులు, భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకునేది లేదు'

ఆర్మూర్‌టౌన్, మార్చి 18: పట్టణంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే ఊరుకునేది లేదని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్ అన్నారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పట్టణంలోని బాలికల పాఠశాల, జావిద్‌బాయ్ మినీస్టేడియంలో సొంత ఖర్చులతో అభివృద్ధి పనులను చేస్తే ఆదివారం గుర్తుతెలియని వారు బాలికల పాఠశాలలో తాళలు పగులగొట్టి ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్‌లను ధ్వంసం చేశారని, అలాగే జావిద్‌బాయి మినీస్టేడియానికి కట్టిన కంపౌండ్‌వాల్ ధ్వంసం చేశారని అన్నారు. వీరి వెనుక ఎవరి హస్తం ఉందో పోలీసులు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పెద్దోళ్ల భరత్, ఉదయ్‌గౌడ్, సాంబాడి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

బోధన్ రూరల్, మార్చి 18 : సాలూర మండలంలోని హున్సా సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ కార్యదర్శి హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొద్దు తిరుగుడు పంటను పండించిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి క్వింటాల్‌కు రూ.6750 పొందాలన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రమేష్, వినోద్‌రావు, సంజు పటేల్, సంగ్రామ్ పటేల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ముప్కాల్, మార్చి 18: ఉమ్మడి బాల్కొండ మండలంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైనట్టు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. బాల్కొండ మండలంలో 488మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ముప్కాల్ మండలంలో 211మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, మెండోర మండలంలో 355మంది విద్యార్థులకు గాను 354మంది పరీక్షలు రాయగా ఒకరు గైర్హాజరైనట్టు ఆయన తెలిపారు.

మాక్లూర్: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైనట్టు ఎంఈవో రాజగంగారాం తెలిపారు. మండలంలోని ఆయా పరీక్ష సెంటర్‌లో 630మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఆయన తెలిపారు.

మనోహరాబాద్‌లో ఇసుక డంప్ వేలం

జక్రాన్‌పల్లి, మార్చి 18: మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో సోమవారం ఇసుక డంప్‌ను అధికారులు వేలం వేశారు. తహసీల్దార్ కిరణ్మాయి పోలీసుల సమక్షంలో ఇసుక డంప్ వేలం నిర్వహించారు. గత వారం రోజుల క్రితం ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక డంప్‌ను గుర్తించి మైన్స్, రెవెన్యూ, పోలీసులు గుర్తించి సీజ్ చేసిన విషయం విధితమే. ఈ మేరకు మనోహరాబాద్ గ్రామంలో అధికారులు ఇసుక డంప్ వేలం నిర్వహించగా అదే గ్రామానికి చెందిన కురల చిన్న గంగారాం రూ.లక్ష 21వేల 500 వేలం పాట పాడి ఇసుక డంప్‌ను దక్కించుకున్నాడని అధికారులు తెలిపారు. వేలం పాటలో వచ్చిన డబ్బులను ప్రభుత్వ ఖాజానలో జమ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రవీన్, పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

డిచ్‌పల్లి, మార్చి 18: మండలంలోని బర్దిపూర్ గ్రామంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి మంజూరు చేసిన 2లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు పనులు సోమవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేవరాజు, భాస్కర్, ధర్మరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ గుర్తులను తొలగిస్తున్న సిబ్బంది

డొంకేశ్వర్, మార్చి 18: ఎన్నికల కోడ్ రావడంతో గ్రామపంచాయతీ పంచాయతీ సిబ్బంది, రాజకీయ పార్టీల జెండాల గద్దెలకు రంగులు వేయడంతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బోర్డులు, నాయకుల ఫోటోలు, జెండాలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. డొంకేశ్వర్ కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని రాజకీయ పార్టీల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ప్రధాన మంత్రి ముఖ్యమంత్రి ఫోటోలకు సంబంధించిన బోర్డులను తొలగించారు. పలు పార్టీలకు సంబంధించిన జెండా గద్దెలకు తెల్లరంగు వేశారు. రోడ్లకు ఇరువైపుల ఉన్న పార్టీల బ్యానర్‌లను ఫ్లెక్సీలను విద్యుత్ స్తంబాలకు చెట్లకు ఏర్పాట్లు చేసిన వాటిని పంచాయతీ సిబ్బందిచే తొలగించారు.

కాంగ్రెస్‌లోకి ముప్కాల్ మాజీ సర్పంచ్

ముప్కాల్, మార్చి18: ముప్కాల్ తాజామాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మణికంఠ పంక్షన్‌హాల్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి కొమ్ముల శ్రీనివాస్‌కు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాపాలనలో చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జక్క రాజేశ్వర్, చంద రవి, ప్రవీన్, విజయ్, బద్దం సాగర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రజాభవన్‌లో సోమవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో బద్దంవాడకు చెందిన పెద్దమనుషులు, రైతులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన రైతులకు ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పథకాలకు స్పందించి పార్టీలో చేరామని ముత్యాల సునీల్‌కుమార్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కడపాటి రాజేశ్వర్, జైడి నరేష్, బద్దం హన్మాండ్లు, చిన్నారెడ్డి, అశోక్, సుబాష్, మోతె గంగారెడ్డి, రాజ్‌భరత్, నితిష్, ప్రమోద్, గంగారెడ్డి, జైడి గంగారెడ్డి, జైడి మహిపాల్‌రమేష్‌తో పాటు సంఘ సభ్యులు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, పి.మహిపాల్, పుప్పాల అశోక్, చిన్న గంగారాం, గిర్మాజీ గోపి, రమేష్, గంగాధర్, అర్గుల రమేష్, నసీర్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

జక్రాన్‌పల్లి, మార్చి18: మండలంలోని గన్యాతాండా గ్రామానికి చెందిన అజ్మీర సాయినాథ్, అజ్మీర సాయికిరణ్, బానవత్ లోకేష్‌లు శ్రీరాం సాగర్‌లోని హెడ్‌రెగ్యులటర్ కాలువలో ప్రమాదత్తు పడి మృతి చెందగా వీరి కుటుంబసభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గన్యతాండా ఎంపీటీసీ అంకం లక్ష్మీ జయప్రకాష్ విన్నవించారు. సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఇరువురి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జక్రాన్‌పల్లి, మార్చి18: మండలంలో మనోహరాబాద్, చింతలూర్ గ్రామా లలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు సోమ వారం పశువైద్యాధికారి శిరీష తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో పశువులకు, ఆవులకు సుమారు 962పశువులకు టీకాలు వేసినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం

డొంకేశ్వర్, మార్చి18: రైతు నేస్తం కార్యక్రమానికి డొంకేశ్వర్ మండల రైతులురైతులు హాజరుకావాలని మండల వ్యవసాయాధికారిణి జ్యోష్ణభవాని తెలిపారు. రైతులు పండించే వరి, ఆయిల్‌ఫాం, కూరగాయల సాగుపై మంగళవారం ఉదయం 10గంటలకు ఆర్మూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఆమె తెలిపారు. పంటల సాగుపై రైతులకు కలిగిన సందేహాలను శాస్త్రవేత్తల ద్వారా నివృత్తి చేస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఒకరికి 5 సంవత్సరాల జైలు శిక్ష

నిజామాబాద్ లీగల్, మార్చి 18: బిడ్డలను చంపి తాను చనిపోవడనికి ప్రయత్నించిన పల్లెపు అమృతకు డిస్ట్రిక్ ప్రిన్సిపాల్ సెషన్స్ జడ్జి సునిత కుంచాల 5 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. లైజనింగ్ ఆఫీసర్ శ్యామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిపెట్‌కి చెందిన పల్లెపు అమృత, తన భర్త శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా తర చు గోడవ పడెవారు. ఈ నేపథ్యంలో 28-02-2023 నాడు గోడవ పడి దానికి తోడు తను అనరోగ్యంతో బాదపడుతున్న పల్లెపు అమృత విసుగుచెంది తన ఇద్దరు పిల్లలను 2 సంవత్స రాల మనశ్రియ, 6 నెలల మనుతెజను నందిపెటలోని గుత్ప ఎత్తిపోతల కెనాల్ లో తోసి వేసి తాను దుకాగా గమనించిన స్థానికులు కాపాడాగా అప్పటికె ఇద్దరు పిల్లలు చనిపోయారు. నందిపేట్ పోలీసులు ఐపీసీ 302, 309 ప్రకారం కెసు నమోదు చెసుకోని కోర్టులో దాఖాలు చేయగా విచారణ అనంతరం సెషన్స్ జడ్జీ సునిత కుంచాల పల్లెపు అమృతకు 5 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ అదనంగా 1,000 రుపాయల జరిమాన విధించారు. జరిమానా కట్టని యడల మరో 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసువారి తరుపున పీపీ రవి రాజ్ వాదించారు.



మద్నూర్ అసిస్టెంట్ రిటర్నింగ్ కార్యాలయంలో మాట్లాడుతున్న అధికారి

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకదృష్టి

● అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి

మద్నూర్, మార్చి 18: మండల కేంద్రంలోని అసిస్టెంట్ రిటర్నింగ్ కార్యాలయంలో జుక్కల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికలపై రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టి పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో తాగునీరు, విద్యుత్, వికలాంగులకు ర్యాంపులు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అంతరాష్ట్ర సరిహద్దులో నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయా పార్టీల నాయకులతో మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు. సమావేశంలో బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, బిచ్కుంద సీఐ నరేష్, మద్నూర్ ఎస్సై శ్రీకాంత్ గౌడ్, ఏడు మండలాల తహసీల్దార్లు, మద్నూర్ తహసీల్దార్ ఎండీ ముజీబ్, డిప్యూటీ తహసీల్దార్ భరత్, విజయ్, ఆర్ఐ శంకర్, తదితరులున్నారు.

బాన్సువాడ ఆర్డీవోగా బాధ్యతల స్వీకరణ



నూతన ఆర్డీవో రమేష్ రాథోడ్

బాన్సువాడ, మార్చి 18: బాన్సువాడ నూతన ఆర్డీవోగా రమేశ్ రాథోడ్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో బాన్సువాడ ఆర్డీవోగా పని చేసిన భుజంగరావు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రమేశ్ రాథోడ్ వచ్చారు. బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చినట్లయితే త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

మందాపూర్‌లో పెద్దమ్మ పండుగ

బీబీపేట, మార్చి 18: మండలంలోని మందాపూర్ గ్రామంలో ముదిరాజ్ కులస్థుల ఆరాధ్యదైవం పెదమ్మతల్లి పండుగను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.మంగలవారం గ్రామదేవతైన పోచమ్మకు బోనాలు, బుధవారం పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణం,బోనాలు సమర్పిస్తారు. గురువారం బండ్ల ప్రదర్శన, తిరుగు బోనాలు, అన్నప్రసాద వితరణ, ఒగ్గుకథలు ఉంటాయని తెలిపారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

'పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి'

కామారెడ్డి టౌన్, మార్చి 18: పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ పీహెచ్‌సీ వద్ద ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన పీఆర్‌సీలోని ఏడు నెలలకు సంబంధించి ఏరియర్స్ కూడా వైద్యశాఖ అందించలేదని, ప్రస్తుత ప్రభుత్వంలోనైనా సమయానికి వేతనాలు అందుతాయని ఆశించామని, తమ ఆశలు నిరాశలుగానే మిగిలిపోతున్నాయని వాపోయారు. కాగా, నేషనల్ హెల్త్‌మిషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈనెల 21 వరకు విరామసమయంలో నిరసనలు వ్యక్తం చేస్తునే ఉంటామని తెలిపారు. అయినా ప్రభుత్వంలో ఎలాంటి స్పందన రాకుంటే 22న నిరవధిక సమ్మె చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటరమణ, రాహుల్‌కుమార్, వరలక్ష్మీ, సంధ్య, కవిత, లక్ష్మీ, హరినాథ్, రేణుక, సంధ్య, అర్షియా, దీవెన, తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆరోగ్యకార్యకర్తలు నల్లబ్యాడ్జీలు దరించి సోమవారం నిరసన వ్యక్తం చెశారు.వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి జీతాలు రాలేదని, ఏళ్ల నుంచి ప్రజలకు సేవలు అందిస్తున్నామని రెగ్యులేషన్ కాలేదని, ప్రభుత్వం తమ సేవలను గుర్తించి రెగ్యులేషన్ చేయాలని కోరారు. ఇందులో ఆరోగ్య కార్యకర్తలు సుశీల, స్వాతి, సవిత, స్వప్న,అంజలి, రాజేశ్వరి, ముజైదా పాల్గొన్నారు.

బిచ్కుందలో 56వ రైతు మహాజన సభ

బిచ్కుంద, మార్చి 18: సొసైటీ చైర్మన్‌గా రైతుల ముఖాలలో సంతోషం చూడడమే నా లక్ష్యమని సొసైటీ చైర్మన్ బాలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 56వ రైతు మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.డుతూ 2024-25 సంవత్సరం బడ్జెట్‌లో భాగంగా రైతులకు కొత్తగా రూ.30 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని, కోటి రూపాయల వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉంచాలని తీర్మానించినట్లు వివరించారు. సొసైటీ ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మాణానికి మరో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఇందులో ఎండీ క్రాంతికిరణ్, సొసైటీ వైస్ చైర్మన్ యాదరావు, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం

● జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మీ ● అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటచేలను పరిశీలించిన పరిశీలించిన అధికారులు

తాడ్వాయి, మార్చి 18: మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా వ్యవసాయా ధికారి భాగ్యలక్ష్మీ తెలిపారు. సోమవారం మండలంలోని ఎండ్రియాల్ గ్రామంలో నష్టపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షానికి పంటలు బాగా దెబ్బతిన్నాయని ముఖ్యంగా మొక్క జొన్న పంటకు బాగా నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టపోయిన మొక్కజొన్న పంట, వరి పంట వివరాలను పైఅధికారులకు పూర్తిస్థాయి నివేదిక అందిస్తామ ని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాశాఖాధికారి శ్రీకాంత్, ఏఈవో రాకేష్ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● 'పంట నష్టపరిహారం ప్రభుత్వమే చెల్లించాలి'

సదాశివనగర్: అకాలవర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాలలో అకాలవర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట చేతికి వచ్చే దశలో వర్షాలకు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో పంటనష్టాన్ని అంచనావేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరి పంట, వానల వల్ల వడ్లు రాలిపోయాయని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి పంట సాగు చేసుకున్న రైతులకు అకాల వర్షాలకు ఒకశాపంగా మారాయని ఆయన పేర్కొన్నారు.

● బాధిత రైతులను ఆదుకోవాలని వినతి

భిక్కనూరు: ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షానికి భిక్కనూరు మండలంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌కు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మండలంలో వడగండ్ల వర్షానికి వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, పంట నష్టపోయిన ప్రతి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, భూంరెడ్డి, అత్తెల్లి శ్రీనివాస్, తునికి వేణు, రాంచంద్రం, వెంకట్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, పోతిరెడ్డి, నర్సారెడ్డి, మల్లేషం, ప్రభాకర్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని ఆయాగ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖాధికారులు సోమవారం పరిశీలించారు. మండలంలోని మంగ్లూర్, వెల్గనూర్ గ్రామాల్లో ఏఈవో స్వర్ణలత నేలకొరిగిన జొన్న, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షానికి ఆయా గ్రామాలలో 28 ఎకరాల్లో జొన్న దెబ్బతిందని, వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. అలాగే వడ్డేపల్లి క్లస్టర్ పరిధిలో మల్లూర్, జక్కాపూర్, వడ్డేపల్లి, తండాలలో నేలకొరిగిన వివిధ పంటలను ఏఈవో రేణుక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షానికి 32 ఎకరాల్లో పంటలు నష్టపోయాయని, నివేదికలు తయారు చేస్తున్నామని పేర్కొన్నారు.

రాజంపేట: మండలంలోని తలమడ్ల, శివాయిపల్లి గ్రామాలలో అకాల వర్షం, వడగండ్లతో నష్టపోయిన పంట పొలాలను సోమవారం సహాయ వ్యవసాయ సంచాలకురాలు అపర్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షంతో కూడిన ఈదురుగాలుల వల్ల వరి, మొక్కజొన్న, కూరగాయ పంటమొక్కలు నేలవాలాయని తెలిపారు. అంతేకాకుండా భూగర్భజలాల నీటిమట్టం పడిపోయి, బోర్లు ఎత్తిపోవడంతో పంటలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుండడంతో వర్షం కొద్దిగా ఊరటనిచ్చిన వడగండ్లు, ఈదురుగాలులతో వల్ల పంటలకు తీవ్ర నష్టం చేకురిందని అన్నారు. నష్టపోయిన పంటల వివరాలను సేకరించిప్రభుత్వానికి నివేదిక పంపుతామని రైతులతో చర్చించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీకాంత్, మన్సూష, తదితరులు పాల్గొన్నారు.



తలమడ్లలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



ఎండ్రియాల్‌లో నేలవాలిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మీ



జక్కాపూర్‌లో జొన్న పంటను పరిశీలిస్తున్న ఏఈవో రేణుక



మంగ్లూర్ శివారులో నేలకొరిగిన జొన్న పంటను పరిశీలిస్తున్న ఏఈవో



సదాశివనగర్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

● బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బీర్కూర్, మార్చి 18: నియోజకవర్గంలో వరి కోతలు ప్రారంభమయ్యాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని దేవేళ్ల శ్రీనివాస్ అనే వ్యక్తికి చెందిన రైస్ మిల్‌కు విచ్చేశారు. గత రెండు రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో శ్రీనివాస్ రైస్‌మిల్ పూర్తిగా ధ్వంసమయ్యింది. ఈ మేరకు ఎమ్మెల్యే రైస్‌మిల్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమైన దృష్ట్యా ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా క్వింటాల్‌కు వరి ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ అందించాలన్నారు. వచ్చే సీజన్‌లో పంట పెట్టుబడిల కోసం రైతులకు ఎకరానికి రైతు భరోసా కింద రూ.15 వేలు అందించాలన్నారు. అలాగే రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు శశికాంత్, కో ఆప్షన్ ఆరీఫ్, నాయకులు అప్పారావు, ఆవారి గంగారాం, రఘు, లాయక్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్‌లు

నాగిరెడ్డిపేట, మార్చి 18: మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లు బీఆర్ఎస్ పార్టీని వీడి సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని ఆత్మకూరు మాజీ సర్పంచ్ గడ్డం బాల్‌రెడ్డి, మాసాని పల్లి మాజీ సర్పంచ్ విఠల్, జలాల్‌పూర్ మాజీ సర్పంచ్ బాల్‌రాంరెడ్డి, మాటూరు మాజీ ఉప సర్పంచ్ కృష్ణలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ స్కీములకు ఆకర్షితులై తాము కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మండల మాజీ సర్పంచ్‌లు తెలిపారు.

ఆలయ సత్రం నిర్మాణానికి భూమిపూజ

బాన్సువాడ, మార్చి 19: మండలంలోని బోర్లం గ్రామంలో దుర్గామాత ఆలయ సత్రం నిర్మాణానికి గ్రామస్థులు సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సత్రం నిర్మాణానికి ఎంఎల్ఏ పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నెర్ర నర్సింలు, మంద శ్రీనివాస్, పర్వారెడ్డి, మన్నె చిన్నసాయిలు, గోపన్‌పల్లి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ప్రజావేదిక

దోమకొండ, మార్చి 18: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 10 గ్రామాలకు సంబంధించిన 2022-23 మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 10 గ్రామాలలో గురువారం నుంచి ఆదివారం వరకు నిర్వహించిన ఆడిట్ అంశాలపై అధికారుల సమక్షంలో చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సాయిలు, ఎంపీడీవోలు చిన్నారెడ్డి, రమేష్, ఏపీవో రజని, టీఏలు రాజేశ్వర్, లింగం, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పసికందు మృతి

కామారెడ్డి టౌన్, మార్చి 18: కామారెడ్డి గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో సోమవారం సపికందు మృతి చెందింది. కుటుంబీకుల విజరాల ప్రకారం.. సోమవారం ఉదయం కామారెడ్డి పట్టణానికి చెందిన ధనలక్ష్మీ అనే గర్భిణి ప్రసవించగా ఆమెకు ఆడపిల్ల జన్మించింది. పసికందుకు తల్లిపాలు ఇచ్చిన అనంతరం తీవ్ర అస్వస్థతతకు గురికావడంతో చిన్న పిల్లల వార్డులోకి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆ పసికందును ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్తున్న సమయంలో మార్గమధ్యలో మృతి చెందింది. అక్కడి నుంచి పసికందు మృతదేహాన్ని తిరిగి జీజీహెచ్‌కు తేగా అప్పటికే విధులకు హాజరైన వైద్యుడు పసికందును పరిశీలించి ఊపిరితిత్తులకు తల్లిపాలు వెళ్లడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఆ తర్వాత పసికందు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ వైద్యులు సమయానికి విధుల్లో ఉండి ఉంటే పసికందు మృతిచెంది ఉండేదికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆసుపత్రి వైద్యులను వివరణ కోరగా ఊపిరితిత్తుల్లోకి పాలు వెళ్లడంతోనే పసికందు మృతిచెందిందని తెలిపారు. తాము ఎక్కడా కూడా చికిత్సలో నిర్లక్ష్యం వహించలేదని తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

రాజంపేట, మార్చి 18: మండలంలోని తలమడ్లగ్రామంలో సోమవారం నర్మలా ప్రవీణ్(32) అనేయువకుడు విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై సంపత్ తెలిపారు. ఇంట్లోకి నల్లనీరు పట్టడానికి మోటారు పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై చనిపోయినట్లు తెలిపారు. మృతుడి భార్య నిఖిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

హోరాహోరీగా కుస్తీ పోటీలు

నిజాంసాగర్, మార్చి 18: మండలంలోని గోర్గల్ గ్రామ శివారులో బేడీల మైసమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి చివరి కుస్తీ రూ.500 వరకు కొనసాగింది. చివరి కుస్తీలో విజేతకు రూ. 2500 నగదును గ్రామ పెద్దలు దుర్గారెడ్డి, మహేందర్ రెడ్డి, అంజయ్య, అంబయ్యల చేతుల మీదుగా అందజేశారు. స్థానిక, చుట్టూ పక్కల మండలాలతో పాటు సంగారెడ్డి, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి మల్లయోదులు విచ్చేసి కుస్తీ పోటీల్లో తలపడ్డారు. ఆలయం వద్ద పలు దుకాణాలు వెలిశాయి.

'ఎంఈవోను సస్పెండ్ చేయాలి'

కామారెడ్డి టౌన్, మార్చి 18: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కామారెడ్డి ఎంఈవో ఎల్లయ్యను సస్పెండ్ చేయాలని కోరుతూ సోమవారం డీఈవో రాజుకు ఎస్ఎఫ్ఐ, బీవీఎం విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్గుల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చితకబాది వాతలు వచ్చేవిధంగా కొట్టిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే కొట్టిన ఉపాధ్యాయులకే వత్తాసు పలుకుతూ విద్యార్థులను విద్యార్థి సంఘాలకు చెబుతారా? అంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపైన ఫిర్యాదు చేస్తే వాళ్ల ఇచ్చే మాముళ్లకు వత్తాసు పలుకుతూ సరైన సదుపాయాలు లేక అధిక ఫీజులు వసూలు చేస్తున్న చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. పైతరగతులు నిర్వహిస్తున్నారని, పాఠశాలల్లో పిల్లలను వేధిస్తున్నారని ఫిర్యాదు చేస్తే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇందులో నాయకులు అరుణ్, విఠల్, బుల్లెట్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

'ఇటుక బట్టీలలో పని చేయిస్తే చర్యలు'

పిట్లం, మార్చి 18: ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలతో ఇటుక బట్టీలలో పనులు చేయిస్తే యజమానులపై చట్టా రిత్యా చర్యలు తీసుకుంటామని డీసీపీవో స్రవంతి అన్నారు. సోమవారం మండలంలోని మద్దెల్‌చెరువు గ్రామంలో గల ప్రభుత్వ ప్రత్యామ్నాయ పాఠశాలను జిల్లా బాల్యరక్ష బృందం సందర్శించారు. వలస కార్మికుల సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటుక బట్టీల వద్ద పిల్లలను పనిలో పెట్టుకోవద్దని, బడీడు పిల్లలకు విద్యను అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఇటుక బట్టీల వద్ద మహిళలు, పిల్లలు ఎంత మంది? వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో డీసీపీవో చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సలర్ పృథ్వీ, సీఆర్పీ గోపాల్, పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

పిట్లం, మార్చి 18: జాతీయ పశువైద్య నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం చిల్లర్గి, చిన్నకోడప్‌గల్ గ్రామాలలో పశువులకు గాలికుంటు టీకాలు వేశామని మండల పశువైద్యాదికారి సంతోష్ తెలిపారు. జాతీయ పశువైద్య టీకాల సందర్భంగా ఆయా గ్రామాలో 354 ఆవులకు, 649 గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే

దోమకొండ, మార్చి 18: పాడిపంటలు, పిల్లపాపలతో ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించేలా ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అంతకుముందు శ్రీమల్లన్న స్వామి, గొల్ల కేతమ్మ మేడలమ్మల కల్యాణం, రేణుకా ఎల్లమ్మ మునిరాజుల కల్యాణం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అగ్ని గుండాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాగరాజు యాదవ్, లక్ష్మణ్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, యాదవ్, రమేష్ యాదవ్, ఎల్లయ్య యాదవ్, రమేష్ యాదవ్, లింగం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామి ఆలయంలో ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

ప్రియా 35ఎంఎం	రజాకర్
దర్శన్	ప్రేమలు
శాంతి	భీమా
ప్రియా 70ఎంఎం	తంత్ర

బాన్సువాడ

వెంకటేశ్వర	భీమా
మహేశ్వరి	రజాకర్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

